మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు రుణాలు

**- కలెక్టర్ బి.యం సంతోష్**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, జులై 26 ప్రభాతవార్త :** మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా లక్ష్యం మేరకు రుణాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా / మండల మహిళ సమాఖ్య సభ్యులు, సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా శక్తి పథకం క్రింద జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాయితీ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకోవడానికి 6675 యూనిట్లకు రూ. 54.04 కోట్ల రుణాలు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ యూనిట్స్, మీ సేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట, పౌల్ట్రీ,ఫిష్ యూనిట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ రంగంలో కస్టమర్ హైర్ సెంటర్ ద్వారా ట్రాక్టర్లతో పాటు ఇతర వ్యవసాయ ఉపకరణాలు రైతులకు అద్దెకు అందించే విధంగా యూనిట్లను గ్రౌండ్ చేయాలన్నారు. లబ్ధిదారుల జాబితాను వెంటనే బ్యాంకర్లకు పంపి, బ్యాంకుల ద్వారా రుణాలు వెంటనే మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లక్ష్యాలను సాధించేందుకు ఏపీఎంలు,డీపీఎంలు పూర్తి బాధ్యతతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్, డిఆర్‌డిఓ నర్సింగ రావు, ఎల్‌డిఎం అయ్యప్ప రెడ్డి, అడిషనల్ డిఆర్డిఓ నరసింహులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు విలాస్ రావు, రామ్మూర్తి, ఏపీఎంలు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగాన్ని ఆపన్నహస్తం

### ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, జులై 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే అన్నదాతలు సాగు చేసే వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చేందుకు వ్యవసాయ సాగు కోసం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశాల్లో రైతాంగానికి పెద్దపీట వేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తూ ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ రైతు పక్షపాత బడ్జెట్ అని గుర్తు చేశారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలకు హామీ పత్రం ఈ బడ్జెట్ అని, అర్భాటపు అంకెలు కాదు, వాస్తవ లెక్కల బడ్జెట్ అని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతూ గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాల మధ్య తెలంగాణ అకాంక్షలను నేరవేర్చేలా ఈ బడ్జెట్‌ను రూపొందించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క బృందానికి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో జీర్ణించుకోలేని మాజీ సీఎం కేసీఆర్ తన అహంకార పూరిత మాటలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై రాద్ధంతం చేయడం సిగ్గుచేటుకరమన్నారు. గత ప్రభుత్వ హయంలో ఇచ్చినటువంటి ఏ ఒక్క హామీ కూడా నేరవేరలేదని, అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసినటువంటి ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఆయన అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఇష్టానుసారంగా మాట్లాడిన కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పిన మార్పు రాలేదని, తొలి సమావేశాల్లో బడ్జెట్ 100శాతం రైతు సంక్షేమానికి రూపొందించబడిందని, ప్రజలు ప్రగాఢ నమ్మకంతో ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## బాలానగర్ కృష్ణ జ్యువెలరీలో చోరీ

### ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకి

**బాలానగర్, జులై 26 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కృష జ్యు వెలరీ షాపులో గురవారం అర్థ రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి ఒకటిన్నర రెండు గంటల ప్రాంతంలో


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

హైవేపైన రాందేవ్‌బాబా కిరాణం ముందు గల ఓమ్ని వాహనాన్ని దొంగిలించి, అక్కడి నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులో గల కృష్ణా జువెలరీ షాప్ దగ్గరికి వచ్చి అక్కడ వాహనాన్ని నిలిపి, కట్టర్ సహాయంతో షట్టర్ తాళాలు కత్తిరించి, గుణపాలతో షట్టర్ ఓపెన్ చేయడం జరిగిందని సిఐ నాగార్జునగౌడ్ తెలిపారు. జువెలరీ షాప్ యజమాని కేశారం చౌదరి కంప్లైంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. 10 కిలోల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. అలాగే దొంగిలించిన ఓమ్ని వాహనాన్ని రాజాపూర్ దగ్గరలో గల మరుధర్ రాజస్థానీ దాబా దగ్గర వాహనం నిలిపి అక్కడి నుండి పరారైనట్లు ఆయన తెలిపారు. క్లూస్ టీం వారు వచ్చి సంఘటన స్థలంలో వేలిముద్రలు, ఆధారాలు సేకరించినట్లు, తొందరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. చోరీకి గురైన జువెలరీ షాప్‌ను జిల్లా ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సిఐ నాగార్జునగౌడ్, ఎస్సై తిరుపాజి స్పష్టం చేశారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం

- రైతులకు అండగా ఉంటాం..
- గ్రావిటీ కెనాల్‌ను పూర్తిచేసి 20 గ్రామాలకు నీటిని అందిస్తాం
- దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు జీఎంఆర్, పర్ణికారెడ్డి
- కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదల

**దేవరకద్ర,జులై 26 ప్రభాతవార్త:** రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని భారీనీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుంచి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి శుక్రవారం ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ


కృష్ణాజలాలకు పూజలు చేస్నున్న ఎమ్మెల్యే జిఎంఆర్

సందర్భంగా ప్రత్యేక పూజల నిర్వహించి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు,సంబంధిత అధికారులతో కలసి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. అనంతరం కోయిల్‌సాగర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడారు. వ్యవసాయరంగానికి ప్రభుత్వం పెద్దపీత వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని అన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు కొనియాడుతున్నారన్నారు. హర్షం వ్యక్తపరుస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి దాదాపు 72వేల6వందల 59కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. పంటనష్టపోతే పంట భీమా చెల్లించేందుకు, వానకాలం సీజన్‌లో సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అంతేగాకుండా విద్య, వైద్యానికి, మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. కొంతమంది కళ్ళులేని కభోదులు విమర్శలు చేయడం సబబు కాదన్నారు. అంకెల గారడీ కాకుండా వాస్తవాలకు దగ్గరగా నిధులను కేటాయింపు చేశారన్నారు. త్వరలో కోయిల్‌సాగర్ గ్రావిటీ కెనాల్‌ను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే నెలలో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిన తరువాత దాదాపు 20 గ్రామాలకు సాగునీటిని అందిస్తామన్నారు. అలాగే పెండింగ్ పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. వాటి అనుమతులను ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తే వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ పనులు పూర్తయితే దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

**రైతుల రుణమాఫీ చేసి తీరుతాం : ఎమ్మెల్యే పర్ణికారెడ్డి**

రైతుల ఖచ్చితంగా రుణమాఫీ చేసి తీరుతామని నారాయణపేట ఎమ్మెల్యే


ఆయకట్టుకు కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

పర్ణికారెడ్డి అన్నారు. కోయిల్‌సాగర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ప్రధాన ధ్యేయమన్నారు. ఇచ్చిన మాటను ఖచ్చితంగా నిలబెట్టుకొంటామన్నారు. సాగునీటిని ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కౌకుంట్ల మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు కొండశ్రీనివాస్‌రెడ్డి, ఉమమహేశ్వర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాలకు చెందినపార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బూట్ల పంపిణీకి శ్రీకారం

- వినూత్న పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సొంత నిధులతో మొదలుపెట్టిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని అభినందించిన సీఎం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 26 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు బాటా బూట్లను ఉచితంగా ఇచ్చే వినూత్న పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. తన సొంత నిధులతో ఈ పథకాన్ని చేపట్టిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు బాటా బూట్లను అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింతగా మెరుగుపర్చాలన్న లక్ష్యంతోనే గత ఏడాది కంటే రూ. 2199 కోట్లు అధిక మొత్తాన్ని ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించామని తెలిపారు. 2023,24 సంవత్సరంలో విద్యా రంగానికి రూ. 19,093 కోట్లను గత ప్రభుత్వం కేటాయించగా ఈ ఏడాది తమ ప్రభుత్వం రూ. 21,292 కోట్ల మొత్తాన్ని విద్యా రంగానికి కేటాయించడం జరిగిందని రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యా రంగంలోని అన్ని సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది పేద విద్యార్థులకు అనిరుధ్‌రెడ్డి బ్రాండెడ్ బూట్లను అందించడంతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని ముఖ్యమంత్రి అభినందించారు.

**పాదయాత్రలో మాటిచ్చా...**

కాగా జడ్చర్ల నియోజకవర్గంలో తాను ఎన్నికలకు ముందు చేసిన ప్రజాహిత పాదయాత్ర చేసిన సమయంలో పేద విద్యార్థులు కాళ్లకు


విద్యార్థులకు బూట్లను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

చెప్పులు కూడా లేకుండా కాలినడకన పాఠశాలలకు వెళ్లడం చూసి తాను ఎంతో ఆవేదన చెందానని, అప్పుడే వారందరికి బూట్లు కొనిస్తానని హామీ ఇచ్చానని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారంగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అన్ని తరగతుల విద్యార్థులకు బాటా బూట్లను పంపిణీ చేయనున్నామని తెలిపారు. పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు ట్యాబ్‌లను కూడా ఇచ్చే ప్రతిపాదన ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్, నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు, ఎంఈవో మంజులదేవి పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవి


కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## రైతులను రుణ విముక్తులను చేశాం

- వ్యవసాయ రంగానికి రూ. 72,000 కోట్లు
- అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 26 ప్రభాతవార్త :** అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 21 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు అత్యధిక నిధులు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని కేటాయింపులు వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 72 వేల కోట్లు కేటాయించడం, రైతులను రుణ విముక్తులను చేసిన రేవంత్‌రెడ్డికి మనమంతా రుణపడి ఉన్నామని, సంక్షేమానికి 47 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం మైనార్టీలకు వెనుకబడిన తరగతులకు అత్యధిక నిధులను కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎప్పుడైనా మీ సమస్యలను మా దృష్టికి, క్యాంపు కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల దృష్టికి తీసుకురావాలని, ఎప్పుడైనా క్యాంపు కార్యాలయానికి రావచ్చని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుందర్‌రాజ్, నయాబ్ తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి,

– మిగతా4లో..

# రాజకీయాల్లో అజాత శత్రువు..సూదిని

- కాంగ్రెస్ నుంచి మొదలైన రాజకీయ జీవితం... కాంగ్రెస్‌తోనే...
- చదువే ఆయుధంగా.. పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన అపరమేధావి
- వెల్దండలో ప్రారంభానికి సిద్ధంగా సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహం
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేపు ప్రారంభోత్సవం

*ఎదురులేని వాగ్ధాటి. మంచి వాక్పటిమ. తిరుగులేని భాషా నైపుణ్య. అంతకు మించిన విషయ పరిజ్ఞానం. మడమ తిప్పని, మాట తప్పని వ్యక్తిత్వం.సుదీర్ఘ రాజకీయానుభవం... సుతిమెత్తని హృదయం... అయిన సూటి దనం.. అపర మేధావితనం.. అయినా అత్యంతగా ఒదిగిపోయే గుణం. ధీశాలి..వినయ విధేయశీలి. సంక్లిష్ట రాజకీయాలనే కాదు..వ్యక్తిగత వ్యవహారాల్లోను..దేనికదే..విడమరచి, వివరించే అందరికి అత్యంత అభిమానధునుడు సూదిని జైపాల్‌రెడ్డి. అపర మేధావి, రాజకీయ దురంధురుడు, ఆధునిక చాణుక్యుడు, ఉత్తమ పార్ల మెంటెరియన్, నడిచే గ్రంథాలయం, అనేక అంశాలకు ఆయనే ఓ ఎన్‌సైక్లోపేడియా. తెలియని పదాలకు అర్థాలు వెత క్కునే డిక్షనరీ..*

అవును ఇవన్నీ దివంగత సూదిని జైపాల్‌రెడ్డికి దక్కిన వరాలు. అంతకంటే ఆయన అందిపుచ్చుకున్న అవకాశాలు. 18 నెలల వయసులోనే పోలియోకి గురై, రెండుకాళ్లు చచ్చుబడ్డ జైపాల్‌రెడ్డి. చిన్న వయసు నుంచే తన లోపాలను అదిగమించి అద్భుతాలను సాధించారు. చదువునే ఆయుధంగా చేసుకొని విషయ పరిజ్ఞానాన్ని పెంచుకున్నారు. విశ్లేషణ చేయగలిగే వాక్పటిమని, వాదించగలిగే వాగ్ధాటిని అందిపుచ్చుకున్నారు. అందుకే ఆయన ఎక్కడ ఉన్నా... ఏ వైపునా నిలిచినా అతడే ఓ సైన్యంగా మారారు.

**- కల్వకుర్తి,జూలై26, ప్రభాతవార్త**



**దుర్గారెడ్డి, యశోదమ్మ దంపతుల పుత్రుడు..**

సూదిని జైపాల్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గులలో 1942 జనవరి 16న జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. జైపాల్‌రెడ్డి తల్లిదండ్రులు సూదిని దుర్గారెడ్డి, యశోదమ్మ. మాడ్గుల, నల్గొండ జిల్లా దేవరకొండలో ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ ఇంగ్లీష్ లిటెరేచర్‌లో పట్టా పొందారు. ఉస్మానియాలో జర్నలిజంలో పీజీ చేశారు. ఉస్మానియా జర్నలిజం శాఖ మొదటి బ్యాచ్ విద్యార్థి జైపాల్.

**రాజకీయ జీవితం..**

విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్న జైపాల్‌రెడ్డి మొదట కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే 1977లో ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి జనతా పార్టీలో చేరారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిర ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేశారు. ఆ సమయంలో 1985 నుంచి 1988 వరకు జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎమర్జెన్సీ అనంతరం 1980లో ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీపై పోటీ చేసి జైపాల్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అయినా ఆమెకు ఎన్నికల్లో ధీటైన పోటీని ఇచ్చారు. 1977లో కాంగ్రెస్‌ను వీడిన జైపాల్


సీఎం సభ స్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తిరిగి, 1999లో మళ్లీ అదే గూటికి చేరారు. కాంగ్రెస్ నుంచి మొదలైన జైపాల్ రాజకీయ జీవితం కాంగ్రెస్‌తోనే చివరికంటా సాగడం విశేషం.

**తొలిసారి అసెంబ్లీలోకి..**

1969లో తొలిసారి మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టిన జైపాల్‌రెడ్డి...నాలుగుసార్లు అదే నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. 1984లో మహబూబ్‌నగర్ లోకసభ నియోజకవర్గం నుంచి తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 1998, 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత 1990, 1996లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. జూన్ 1991 నుంచి 1992 వరకు రాజ్యసభాపక్ష నేతగా వ్యవహరించారు. 1999 నుంచి 2000 వరకు సభా హక్కుల ఉల్లంఘన కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఐకే గుజ్రాల్ కేబినెట్‌లో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. మన్మోహన్‌సింగ్ హయాంలో పెట్రోలియం, పట్టణాభివృద్ధి, సాంస్కృతిక శాఖ మంత్రిగా పనిచేశారు. 1998లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం అందుకున్నారు. జైపాల్‌రెడ్డి అసెంబ్లీలో ఉన్నా... పార్లమెంట్‌లో ఉన్నా... సభ, సమావేశం ఎక్కడ మాట్లాడిన సరే ... ప్రతిపక్షాల నేతలు, సీఎంలు, పీఎంలు సైతం అత్యంత సావధానంగా వినేవారు. ఇక ప్రజలైతే ఆయన వాదనలకు, ఆయన మాటలకు ఫిదా అయ్యేవారు. తనకు అప్పగించిన బాధ్యతలు, పరిమితుల్లోనే ఉండేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్ర మంత్రిగా ఉండి పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు వచ్చాయి కానీ ఉచిత సలహాలు, అనుచిత వ్యాఖ్యలతో పనులు జరగవని తెలిసిన జైపాల్‌రెడ్డి సమయం, సందర్భాలు వచ్చినప్పుడు మాత్రం తన బాధ్యతల్ని ఏనాడు విస్మరించని కార్యోన్ముఖుడు.

**తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర**

తెలంగాణ ఉద్యమంలోను జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్రమంత్రిగా కీలక బాధ్యతల్లో ఉన్న జైపాల్‌రెడ్డికి, వైఎస్ అస్తమయం తర్వాత పరిణామాల్లో ఏపీ సీఎంగా అవకాశం వచ్చింది. ఆ ప్రపోజల్‌ని అత్యంత

–మిగతా2లో..

## పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

**ఉప్పునుంతల, జులై 26 ప్రభాతవార్త :** ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ బిపాషా అన్నారు. శుక్రవారం మండలంలోని సదగోడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పట్ల మహిళలకు అవగాహన కల్పించారు. ఇండ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే రోగాలు దరి చేరవని ఆమె చెప్పారు. పెరటి తోటల పెంపకంతో కలిగే ఉపయోగాలను ఆమె మహిళలకు వివరించారు. అదేవిధంగా రోజువారి ఆహారం ఆకు కూరలను తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాషాతో పాటు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## జడ్పి మాజీ వైస్ చైర్మన్ రమేశ నాయుడుని పరామర్శించిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల, జులై 26 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా వైస్ చైర్పర్సన్ సరోజమ్మ రమేశ్ నాయుడు మాతృమూర్తి పరమావదించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శుక్రవారం హైదరాబాదులోని నిమ్స్ హస్పిటల్ చేరుకుని సరోజమ్మ రమేశ్ నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాతృమూర్తికి నివాళులు అర్పించారు. పార్థివాదేహన్ని గద్వాలకు తరలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కోటిరెడ్డి, మోహన్ రెడ్డి ఉన్నారు. నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సతీమణి జడ్పి మాజీ వైస్ చైర్మన్ సరోజమ్మ రమేశ్ నాయుడు మాతృమూర్తి శుక్రవారం మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి మృతురాలికి నివాళులు అర్పించారు. సరోజమ్మను రమేశ్ నాయుడును పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## మాజీ జెడ్పివైస్ ఛైర్ పర్సన్ కుటుంబం సభ్యులకు పరామర్శ

**కాంగ్రాస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితతిరుపతయ్య ,మున్సిపాల్ చైర్మన్ కేశవ్‌లు**

**గద్వాల,జులై26,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మాజీ జెడ్పి వైస్ ఛైర్ పర్సన్ నరోజమ్మ రమేష్ నాయుడు అత్త బోయ బీసమ్మ అనారోగ్యంతో భాదపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటంబ సభ్యులను మాజీ జెడ్పి ఛైర్మర్సన్ ,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సరితతిరుపతయ్య ,మున్సిపాల్ చైర్మన్ బి.ఎస్.కేశవ్‌లు శుక్రవారం పరామర్శించారు .వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూధన్ బాబు,లత్తిపురం వెంక్రటామిరెడ్డి ,రవీందర్ రెడ్డి ,కొటేష్ ,రంజిత్ ,కుమ్మరిరాము ,కృష్ణ అనంతపురం రాముడు ,రాజా రెడ్డి తిమ్మయ్య లక్ష్మణ, గ్రామస్తులు రామోహన్,మామ సర్పంచ్ నిలేశ్వర్ రెడ్డి మాజీ ఎంపిటీసీ రాధాకృష్ణ రెడ్డి ,జే.రాంరెడ్డి లోకనాథ్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి.గుర్రం గడ్డ బాలకృష్ణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## సంపూర్ణత అభియాన్‌పై అధికారుల సమావేశం

**గద్వాల జులై 26 ప్రభాతవార్త :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాన్ఫరెన్స్ కార్యాలయంలో శుక్రవారం సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం హెచ్ ఓ మాట్లాడుతూ అందరూ బాధ్యతతో పనిచేయాలని సెప్టెంబర్ నెల వరకు నిర్దేశించిన, ఎన్సీడీ ప్రోగ్రామ్ సంబంధించిన బిపి షుగర్ ఏఎం స్క్రీనింగ్ 30 సంవత్సరములు పైబడిన వారందరికీ సెప్టెంబర్ నెలాఖరి వరకు క్వాలిటీ స్క్రీనింగ్ చేసి పూర్తి చేయాలన్నారు. వివిధ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నందు పనిచేస్తున్నాను ఎంఎల్ హెచ్‌పి సిబ్బంది, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు దాదాపు 70 మందితో సమావేశమై ఆరోగ్య కార్యక్రమాలను వివరంగా తెలిపారు. మొత్తం టార్గెటన. 40865.30 సంవత్సరములు పైబడిన ఉండగా అందులో. 5846 మాత్రమే స్క్రీనింగ్ జరిగిందని. వివిధ గ్రామాల యందు మిగిలి ఉన్న జనాభాను.35019. మందికి స్క్రీనింగ్ జరపాలని,డి.ఎం.హెచ్.ఓ తెలిపారు. ప్రతివారం అన్ని సెంటర్ల యందు. 4375 స్క్రీనింగ్ జరిపి ఆన్లైన్, ఆన్లైన్లో ఎంట్రీ చేయవలసి ఉంటుందన్నారు.



## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు ధ్వజం



**ఆత్మకూర్ జులై 26 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు అయన శుక్రవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయిస్తుందని విద్యార్థిలోకి మొదలు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గత పాలకుల మాదిరాగానే కేవలం ఎనిమిది శాతం నిధులు కూడా కేటాయించకుండా విద్యారంగాన్ని పూర్తిగా ప్రస్పటిస్తుందని ఆయన తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందంటూ ఎన్నికల సమయంలో హామీలు కుప్పించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం ప్రస్తుత రాష్ట్ర వార్షిక బడ్జెట్లో మాత్రం కేవలం ఎనిమిది శాతం నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని నిధులు కాస్త అధ్యాపకుల వేతనాలకు సరిపోతాయని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యను బలోపేతం చేస్తామని కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల లను కళాశాలలనే తీర్చిదిద్దుతామని విద్యారంగానికి 30 శాతం నిధులకు తక్కువ కాకుండా కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇట్టినప్పటికి ఆచరణలో మాత్రం విద్యారంగాన్ని పూర్తిగా పస్తు పట్టించిందని వార్షిక బడ్జెట్లో కేవలం 22192 కోట్లు మాత్రమే కేటాయించడం సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచిర చేసి విద్యారంగానికి పెద్దపీట వేయాలని లేనిపక్షంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

## విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిబిరం..

**- ముగిసిన కంటి వైద్య పరీక్షలు**




**వెల్దండ, జులై 26 ప్రభాతవార్త:**కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణకై కృషి చేస్తున్నారు. మండలంలోని ఏవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత ఐక్యత ఫౌండేషన్ అధ్యక్షులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం విజయవంతంగా కొనసాగింది. శుక్రవారంతో కంటి వైద్య పరీక్షలు ముగిశాయని ఫౌండేషన్ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ శిబిరంలో 2400 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 154 మందికి శుక్లాలు ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్లకు సిద్ధం చేయగా, 42 మందికి కంట్లి శుక్లాలను తొలగించి ఆపరేషన్లు విజయవంతం చేసినట్లు తెలిపారు. మరో మూడు రోజుల పాటు 112 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. 1400 మందికి కంటి అద్దాలు అందించినట్లు తెలిపారు. దీంతో పాటు 240 మంది పేషంట్లను చైన్నెలోని శంకర నేత్రాలయానికి వైద్యులు రెఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు అనిల్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌నాయక్, కొండలుయాదవ్, గణేష్, రమేష్, హసన్, శ్రీపతి, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో ప్రతి రైతూ ఆర్థికంగా బలపడాలి

### సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త , డాక్టర్ అశోక్





సేంద్రియ వ్యవసాయం గురించి రైతులను అడిగి తెలుసుకొంటున్న జపాన్ దేశస్థులు, స్పీడ్ సంస్థ నిర్వాహకులు రవి ప్రకాశ్

**గద్వాల, జులై 26 ప్రభాతవార్త:** సేంద్రియ వ్యవసాయంతో ప్రతి రైతు ఆర్థికంగా పురిపుష్టి సాధించాలని సీనియర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అశోక్ రైతులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం నాడు స్పీడు స్వచ్ఛంద సేవా సంస్థ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు దత్తతను తీసుకున్నటువంటి నాగరుదొడ్డి గ్రామానికి జపాన్ దేశ శాస్త్రవేత్తలు వచ్చారు. జపానీ యూనివర్సిటీ నుండి వచ్చినటువంటి విద్యార్థిని విద్యార్థులు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను, సేంద్రియ వ్యవసాయ సాగు గురించి తెలుసుకోవడం కోరకు గ్రామాని సందర్శించడం జరిగింది. సేంద్రియ వ్యవసాయం గురించి తెలుసుకోవడానికి విచ్చేసినటువంటి విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయం గురించి తెలియజేయడానికి హైదరాబాద్ నుండి వచ్చినటువంటి సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త, డాక్టర్ అశోక్ తెలియజేస్తూ సేంద్రియ వ్యవసాయం చేయడం చాలా సులభపద్ధతి అన్నారు. తక్కువ పెట్టుబడితో సేంద్రియ వ్యవసాయంను చేయవచ్చు అన్నారు. సేంద్రియ వ్యవసాయ చేయడం వలన రైతులు తక్కువ పెట్టుబడి ఉంటుంది. రాబడిఎక్కువగా ఉంటుందన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడవలసిన అవసరం ఉండదన్నారు. అధిక రసాయన ఎరువులు, అధిక క్రిమిసంహారక ఎరువులు వాడడం వలన వ్యవసాయ భూమిలోని పోషకపదార్థాలు తేమశాతం దెబ్బతింటుందన్నారు. రైతులకు పెట్టుబడి ఎక్కువగా అవుతుందన్నారు. పూర్వకాలము భారతదేశంలో వ్యవసాయంను ఆవుపేడ, ఆవు మూత్రంతో వానపాములతో ఆకులతో సేంద్రియ ఎరువులుగా మార్చుకుని సేంద్రియ వ్యవసాయని మన పూర్వీకులు పెద్దలు, సాగు చేసేవారన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించినటువంటి పంటలు శ్రేష్టమైనవి, మానవ మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లెది కాదన్నారు. కనుక ప్రతి రైతు రసాయన ఎరువులు , క్రిమిసంహారక మందులను వాడకుండగా సేంద్రియ వ్యవసాయంను సాగు చేసుకోవాలని సూచనలు చేశారు. ప్రతి రైతు ఆర్థికంగా బలపడాలని తెలిపారు. జపాని యూనివర్సిటీ విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులు గురించి తెలియజేసి క్షేత్రస్థాయిలో నాగర్‌దొడ్డి గ్రామం రైతులు సాగు చేస్తున్నటువంటి ఆర్గానిక్ పత్తిపోలాలను చూయించారు. విద్యార్థులు రైతులతో మాట్లాడారు. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థుల టీం లీడర్ ఇనాగాకి, వివాసకి, డా.అరుణ్, స్పీడు సంస్థ అధ్యక్షులు రవి ప్రకాశ్, గ్రామ రైతులు , గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం..

**ఎస్ఎఫ్ఐ మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రాములు**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 26 ప్రభాతవార్త :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు 3 రోజులపాటు సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. రాములు పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.3% ఇది గత ఓటాన్ బడ్జెట్‌లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ. గత బడ్జెట్‌లో విద్యా రంగానికి 21,389కోట్ల రూపాయలు కేటాయించింది. అది ప్రస్తుతం 21,292 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య యే మాత్రం అభివృద్ధి కాదని వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినది. కానీ దాని ఊసు ఈ బడ్జెట్‌లో లేదు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు. దాని గురించి చర్చే లేదు. యూనివర్సిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500ల కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోను 300 కోట్లు ఫలహారం పంచినట్లు పంచారు. యూనివర్సిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్సిటీలు నోచుకోవు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని ఎస్ఎఫ్ఐ ప్రశ్నిస్తుందన్నారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్సిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారు. ఉస్మానియాకు 1000 కోట్లు, మహిళ యూనివర్సిటీల అభివృద్ధి కోసం, 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్సిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్సిటీలు అభివృద్ధి కోసం 500ల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది.

రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్సిటీలకు కనీసం నిర్వహణకు కూడా నిధులు రావు. ఒక్క ఉస్మానియా యూనివర్సిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్‌టియుహెచ్, ఫైన్ఆర్ట్స్, మహిళా యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వెటర్నరీ, హార్టికల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి కూడా ప్రస్తావన లేదు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ నాయకులు నందు, ఈశ్వర్, సాయి, కావ్య, మనీషా, మానస పాల్గొన్నారు.

## శాకాంబరి అవతారంతో దర్శనమిచ్చిన వాసవిమాత అమ్మవారు

**- ఘనంగా ఆషాడమాసం పూజలు**

**దేవరకద్ర,జులై 26 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాప రమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాడమాసం సందర్భంగా మూడవ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని కూడ అత్యంత ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వ హించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి అర్చకు డు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.గోవిందు,గీతారిణిల అధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఇటిక్యాల జులై 26 ప్రభాతవార్త :**మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో గల ప్రాథమికొన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్సకాల నుండి విద్యార్థుల కు విద్య నేర్పినా ఉపాధ్యాయులు బదిలీలలో భాగంగా పాఠశాలలకు బదిలీ అయ్యారు. బదిలీ పై వెళ్లిన ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరావు మల్దకల్ కు , స్వాములు పూదూర్ కు, అన్వర్ తిమ్మాపూరన కు బదిలీ కాగా. బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులకు నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు ఖరేందర్ నాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా గ్రామ నాయకులు వానిరి ఘనంగా సన్మానించారు. గత కొన్ని సంవత్సరాల నుండి పాఠశాల కు చేసిన సేవలు, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి నీ గ్రామస్తులు కొనియాడారు. బదిలీ పై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రజలందరి సహాయ సహకారం తో తమ వంతు గా విద్యార్థులు కు భోదించడం జరిగింద అన్నారు. అలాగే గత పది సంవత్సరాల నుండి పాఠశాలలో పనిచేసి విద్యార్థులను, గ్రాస్తులతో ఉన్నా అనుబంధం స్థిరస్థాయిగా నిలిచి పోతాయి అన్నారు. అనంతరం బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులను నూతన ఉపాధ్యాయులు, విత్యార్థులు శాలువ పూలమాల తో ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామ మాజీ సర్పంచ్ ల సంఘం తాలుక అధ్యక్షులు. మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి తాజా మాజీ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ విద్య కమిటీ చైర్మన్ వెంకన్న. అమ్మ ఆదర్శ పాట శాల చైర్మన్ మహేశ్వరీ రామూర్తి లు శాలువ పూలమాల తో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ్, హుసేన్, రాజశేఖర్, గ్రామ పెద్దలు రాంభూపాల్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, నాగరాజ్, శేఖర్ రెడ్డి, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పచ్చటి మొక్కలతోనే బావి తరాలకు భవిష్యత్తు

**వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు**



**గద్వాల టౌన్,జులై 26,ప్రభాతవార్త :**వాతావరణ సమతుల్యత,పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని, తద్వారనే బావి తారలకు మంచి భవిష్యత్ అందించగలమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. వాతావరణ సమతుల్యత, పర్యావ రణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా బావించి మొక్కలు నాటాలని, పచ్చటి మొక్కలు నాగడ మంటే భవిష్యత్ త రాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్క లు నాటే బాధ్యతను స్వీకరించాలని, నాటడంతోపాటు, వాటి సరంక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు ముందుండడడం జరుగుతుందని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్దేశిత మొక్కలు నాటాడం జరుగుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయాల ఆవరణ లో శుక్రవారం మొత్తం 605 మొక్కలు నాటినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. గుణ శేఖర్, డీ.ఎస్పీ సత్యనారా యణ, కార్యలయ ఏ.ఓ సతీష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వెంకటేష, హారీఫ్, సూపరింటెండ్ నాయిాం, టౌన్ ఎస్సై శ్రీనివాస్, రూరలన ఎస్సై పర్వతాలు, ఎస్సైలు రజిత, జి. రజిత, ఆర్.ఎస్సైలు విజయ్ భాస్కర్, చంద్ర కాంత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..!!

**భూత్పూర్,జులై 26,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం ఉదయం భూత్పూర్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది.భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం భూత్పూర్ మండలం శేరుపల్లి(హెచ్)కు చెందిన ఎల్పటిరాములు కుమారుడు ఎల్పటి సాయితేజ(21)తన గ్రామం నుంచి జడ్చర్లకు మోటార్‌బైక్‌పై వెళ్తూ భూత్పూర్ జాతీయ రహదారి-44 కూడలికి సమీపంలో శ్రీసంజీవరాయుడి గుడి వద్ద జాతీయ రహదారికి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపై సాయితేజను ఎదురుగా వస్తున్న బొలేరో ఢీకొట్ట గా సాయితేజ తలకు ముఖానికి బలమైన గాయాలై తల పగిలి విపరీతమైన రక్తస్రావంతో రోడ్డుపై అక్కడికక్కడే మృతి చెందాడు.మోటార్ సైకిలిస్ట్‌ను ఢీకొట్టి అతడి మృతికి కారణమైన బొలేరో డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.శవాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో వన మహోత్సవం..

**ఉప్పునుంతల,జులై 26 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎబివిపి ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెజిబివిలో బాలికల చేత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం ఎబివిపి నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంట ఒక మొక్కను నాటి పెంచాలని కోరారు. వాతావరణ కాలుష్య నివారణకు చెట్ల పెంపకమే ప్రధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారిణి సైదా, ఎబివిపి మండల శాఖ కార్యదర్శి షాపుల మహేష్, సంయుక్త కార్యదర్శి మొగిలి శివ, ఉపాధ్యాయ సిబ్బంది, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైడేలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్..



**భూత్పూర్,జులై 26,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ వట్టణంలోని ఐదో వార్డు అమిస్తాపూర్‌లో వైద్యాధికారి డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి పరిసరాల పరిశుభ్రత గురించి వార్డు ప్రజలకు మెడికల్ ఆఫీసర్,కమిషనర్ వివ రించారు. వార్డులో అక్కడక్కడా ఉంచిన నిల్వ నీటిని అధికారులు పారవేయించారు.ప్రతీ శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ అయూబ్‌ఖాన్,హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో అజాత శత్రువు..సూదిని

(మొదటి పేజీ తరువాయి)

సున్నితంగా తిరస్కరించారు ఆయన. కిరణ్‌కుమార్‌రెడ్డి పేరును సూచించింది కూడా జైపాల్‌రెడ్డేనని రాజకీయంగా అవగాహన ఉన్నవాళ్లకి చాలా మందికి తెలుసు. ఇక కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అక్రమంగా గ్యాస్ వినియోగిస్తున్నారని రిలయన్స్ ముఖేష్ అంబానీకి అపరాధ రుసుములు విధించి..కేంద్రమంత్రిగా జైపాల్‌రెడ్డి సంచలనం సృష్టించారు.

**బిల్లు ఆమోదంలో..**

తెలంగాణ బిల్లు ఆమోదం సమయంలోను జైపాల్‌రెడ్డి కీలకంగా పనిచేశారు. ఏపీ ఎంపీల వ్యతిరేకతల నినాదాల మధ్య బిల్లును పార్లమెంట్‌లో ఎలా ఆమోదింపచేయవచ్చో ఆనాడు స్పీకర్ మీరాకుమారి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పక్షానికి, అప్పటి పార్లమెంట్‌రీ వ్యవహారాశాల శాఖ మంత్రి కమల్‌నాథ్‌కి వివరించడం, బీజేపీ ప్రతిపక్ష నేత అయన సుష్మాస్వరాజ్‌తో ఆయనకున్న పరిచయాన్ని ఉపయోగించి, చివరకు ఆ పద్ధతిలోనూ బిల్లు నెగ్గడం ఆయన పార్లమెంటరీ అనుభవానికి నిదర్శనం. రాజకీయాలను, వ్యక్తిగత జీవితాలను వేరుగా చూసిన వ్యక్తిత్వం జైపాల్‌రెడ్డిది. ప్రస్తుత రాజకీయాలకు భిన్నంగా తన కుటుంబ సభ్యులెవరిని తన రాజకీయ వ్యవహారాల్లోకి రానివ్వలేదు. అలాగని రాజకీయ ఆసక్తితో పాటు అర్హతలున్న వాళ్లెందరినో ప్రోత్సహించారు. వాళ్లంతా రాజకీయాల్లో అనేక పదవులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఎన్నో అవార్డులు..మరెన్నో రివార్డులు.. అందుకున్న గొప్ప పొలిటిషియన్‌ను కోల్పోవడం దేశానికే తీరని లోటు. రాజకీయంగానే కాదు.. వ్యక్తిగతంగా, జర్నలిజం వృత్తి పరంగా, సామాజికంగా ఎదగాలనుకేనే వాళ్లెవ్వరికైనా సరే.. సూదిని జైపాల్‌రెడ్డి జీవితం పఠనీయం. సదాస్మరణీయం. ఆచరణీయం.

**రేవంత్‌రెడ్డికి రాజకీయ గురువు..**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తన రాజకీయ గురువు దివంగత సూదిని జైపాల్‌రెడ్డిని పలు బహిరంగ సభల్లో, సామాజిక మాధ్యమాల్లో ఇంటర్వ్యూల్లో గర్వంగా చెప్పారు. తన నుంచి రాజకీయాలు నేర్చుకున్నానని, ఆయన అడుగు జాడల్లో నడిచి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని పలు సందర్భాల్లో సూచించారు.

**సీఎం రేవంత్‌రెడ్డిచే విగ్రహావిష్కరణ...**

వెల్దండ మండలం కొట్ర చౌరస్తా వద్ద ఈనెల 28న కేంద్రమాజీ మంత్రివర్యులు సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహన్ని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కల్వకుర్తికి వస్తుండటంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు.

**అలుపెరుగని రాజకీయ యోధుడు సూదిని జైపాల్‌రెడ్డి**

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



అపర మేధావి, రాజకీయ దురంధురుడు, ఆధునిక చాణుక్యుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, నడిచే గ్రంథాలయం స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కొనియాడారు. ఈ నెల 28న వెల్దండ మండలం కొట్ర చౌరస్తాలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. పాలమూరు పల్లె నుంచి ఢిల్లీకి వెళ్లినా...దేశంలోనే అత్యంత ప్రత్యేక రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయన పాలమూరుకు వస్తే చాలు తెలిసిన వాళ్లని పేర్లతో, వరుసలతో పిలుస్తూ అందరిని ఆశ్చర్యపరిచేవారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సాధనలో కార్యన్మోఖుడయ్యారని కొనియాడారు. ఓనమాలు నేర్చిన పార్టీలోనే తనువు చాలించారని, ఆయన దేశానికి, రాష్ట్రానికి ఎన్నో సేవలు చేశారన్నారు. మన ప్రాంతంలో సీఎం చేతుల మీదుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో శుభసూచికమన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన స్వామి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 26 ప్రభాతవార్త:** ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం నాగంకర్నూల్ మండలం శ్రీపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శ్రీపురం గ్రామానికి చెందిన సింగారపు స్వామి (33) తన సొంత వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో కరిగేట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి దానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి

**ఇటిక్యాల జులై26,ప్రభాతవార్త:** అసెంబ్లీ సమావేశాల్లో రిలీజ్ చేసే జాబ్ క్యాలెండర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ పై ప్రకటన చేయ్యాలనీ డాక్టర్,ప్రేమ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా యూనివర్సిటీ లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ అధ్యాపకులతో ప్రభుత్వం కాలం గడుపుతూ వస్తుందని. ఆప్రభావం విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుందని ,అధ్యపకులకు భోధన పై దృష్టి పెట్టడం కష్ట తరం అవుతుందని.ఇకనైనా యూనివర్సిటీలపై దృష్టి ఉంచాలని యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్, బ్యాక్ లాగ్ పోస్టులు ఖాళీలు ప్రకటించి,రిక్రూట్మెంట్.జరపాలని నిరుద్యోగులతో యూవతలో నిరాశ నిస్పృహలకు లోనే ఉన్నారని కనీసం ఈ ప్రభుత్వం ఐన నిరుద్యోగుల గురించి అలోచించి,అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలు నింపాలని అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్‌కి, జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్స్ కి గౌరవ వేతనం పెంచుతూ, కాన్సిలిడేట్ పేమెంట్ ఇస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని డా.ప్రేమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

## గోపాల్ పేట మండల కార్యవర్గ సమావేశం

**గోపాల్‌పేట జులై26 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ గోపాల్ పేట మండల కార్యవర్గ సమావేశం పెద్దిరెడ్డి తిరుపతి రెడ్డి అధ్యక్షతలో గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పార్టీని బూతు స్థాయి నుంచి బలోపేతం చేస్తూ మూడోసారి మోడీ ప్రధానమంత్రి కావడం జరిగింది. అందుకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలకు కృషి ఫలితంగా రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామాన బిజెపి జెండా ఎగరవేయాలని ప్రస్తావించడం జరిగింది.అందుకు అనుగుణంగా మోడీ యొక్క సంక్షేమ పథకాలను ప్రతి బూతు స్థాయిలో వివరించగలరని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది, మొన్న జరిగిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రైతులకు మధ్యతరగతి కుటుంబాలకు నిరుద్యోగులకుచిరు వ్యాపారులకు మంచి బడ్జెట్ ను సమర్పించిందని వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు మాధవ రెడ్డి నారాయణ మండల జనరల్ సెక్రటరీ నాగరాజు, అశోక్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అరుణమ్మ, ఉపాధ్యక్షుడు వామన్ గౌడు, ఓబిసి మోర్చా అధ్యక్షుడు సురేష్ గౌడు, మండల నాయకులు బలిజ లింగం శివి, అనురాగ్, దామోదర్‌మల్లికార్జున్, మల్లేష్,తిరుపతితదితరనాయకులు పాల్గొనడం జరిగింది.

## ప్రతి రైతు బీమా చేసుకోవాలి

**బిజినపల్లి, జులై26 ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి రైతు భీమా చేసుకోవాలని ఏఓ నీతిరెడ్డి సూచించారు. మండలంలో 2749 మంది రైతులు రైతు భీమాకు దరఖాస్తు చేసుకోలేదని వివరించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న ప్రతి రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో జత చేసిన రైతుభీమా దరఖాస్తు ఫారాన్ని సంబంధిత గ్రామాల ఏఈఓలకు ఈనెల 31లోపు ఇవ్వాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రైతు భీమాకు దరఖాస్తు చేసుకొని అర్హులైన రైతుల వివరాలు ఆయా గ్రామాల ఏఈఓల దగ్గర ఉన్నాయని పేర్కొన్నారు.

## కారుకొండ పాఠశాల తనిఖీ

**బిజినపల్లి, జులై26 ప్రభాతవార్త:** పాలెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మొహీనుద్దీన్, సిఆర్‌పి మల్లేష్‌తో ప్రాథమికోన్నత పాఠశాల కారుకొండను తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లు, రికార్డులు తరగతి వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సామర్థ్యాలు సాధించి మంచి మార్కులు పొందాలని సూచించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు ఇంద్రాణి, చైతన్య, భాగ్యలక్ష్మి, లావణ్య, భారతి, మేఘన ఉన్నారు.

## ఉపాధి హామీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**తెల్కపల్లి, జులై 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధి గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించి ఉపాధి హామీకి సంబంధించిన విలువైన ఫైల్స్, ఎంబిలు, మస్టర్లు,తీర్మాణాలు సంబంధిత పత్రాలు,ఫర్నీచర్ దగ్ధమైనట్లు శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని శుభ్రపరచడానికి వెళ్లిన అటెండర్ కొమ్ము మల్లేష్ గమనించి సంబంధిత మండల అధికారులకు తెలపడంతో వెంటనే ఎంపిడిఓ కృష్ణయ్య, సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎంపిడిఓ కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బి. నరేష్ తెలిపారు.

## పడమటి అంజన్న హుండీ లెక్కింపు

**మక్తల్, జులై26 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఆలయ ఆవరణలో ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో లెక్కింపు చేపట్టగా మొత్తం రూ. 5 లక్షల 38 వేల 840ల ఆదాయం లభించింది. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త ప్రాణేష్‌చారి, ఈఓ శ్యామసుందరచారి, అరవింద్, శ్రీనివాస్, రజనికాంత్, ఆంజనేస్వామి భక్త బృందం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి

**మక్తల్, జులై 26 ప్రభాతవార్త:** విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల కోసం పట్టణంలో 400ల గజాల స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందించి, త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బి. గోపాలం, ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్, సభ్యులు మల్లికార్జున్, సూర్య ప్రకాష్, కిష్టయ్యగౌడ్, సయ్యద్ మౌలానా, సిద్ధి లింగయ్య పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**మక్తల్ టౌన్, జులై 26 ప్రభాతవార్త :** మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాలకు సంబంధించి సీఎం రిలీఫ్ ఫండ్ దాదాపుగా 48 మంది లబ్ధిదారులకు 13 లక్షల రూపాయల చెక్కులను మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. గాంధీ, నిమ్స్, ఉస్మానియా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీకి సంబంధించిన వ్యాధులకు సత్వర చికిత్స అందించడం కొరకు తగిన సహాయం అందించడానికి 24 గంటలు అందుబాటులో ఉంటానని సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి ప్రత్యేకంగా తన క్యాంపు కార్యాలయంలో ఒక వ్యక్తిని నియమించి ఎప్పటికప్పుడు దస్త్రాలను పెండింగ్ లేకుండా బిల్లులు వచ్చేటట్లు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ త్వరలో మిగిలినటువంటి లబ్ధిదారుల చెక్కులను వెంటనే వచ్చేటట్లు చూడాలని పిఎకి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కార్యక్రమంలో మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాలకు సంబంధించిన నాయకులు, ఆయా మండలాల అధ్యక్షులు మక్తల్ కాంగ్రెస్‌టౌన్ అధ్యక్షులు రవికుమార్, మక్తల్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, మాగనూరు మండల అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, గడ్డంపల్లి హనుమంతు, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపల్లి అశోక్‌గౌడ్, బిల్డర్ తాయప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

● జంక్షన్ సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**కల్వకుర్తి, జూలై 26 ప్రభాతవార్త:** ఈ నెల 28న కల్వకుర్తిలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రక్కన ఏర్పాటు చేసిన సభ స్థలిని, వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి క్యాంస విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ఎవరి విధులు వారు సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సభ ప్రాంగణం వద్దకు జనం వచ్చేందుకు వీలుగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ స్టేజీ వద్దకు వచ్చే మార్గాన్ని వారు పరిశీలించారు. కొట్ర గేట్ జంక్షన్ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో హైదరాబాద్-శ్రీశైలం రహదారి జంక్షన్‌లో సుందరీకరణ పనులతో పాటు వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. విగ్రహం చుట్టు సుందరీకరణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రితో పాటు ప్రముఖులు వివిధ రకాల మొక్కలు నాటేలా ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా సీఎం పర్యటన ఏర్పాట్లు అత్యంత పకడ్బందిగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, హెచ్ఎండీఏ సుందరీకరణ, మేనేజర్ రాణి రుద్రమ, హార్టికల్చర్ అధికారి చక్రపాణి, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

### వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : జిల్లా కలెక్టర్


వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**కల్వకుర్తి, జూలై26 ప్రభాతవార్త:** వసతి గృహాల్లో ఉండి విద్యాభ్యాసం చేసే విద్యార్థుల ఆరోగ్యం, వారికి అందించే ఆహారం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కల్వకుర్తి పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ వసతి గృహన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి అకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి వసతి గృహ తరగతి గదులను, పరిసరాలను, వంట గదిని కలెక్టర్ పరిశీలించి, వార్డెన్ సిబ్బంది వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థుల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. వసతి గృహంలో ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్వకుర్తి బాలుర వసతి గృహన్ని సందర్శించడం జరిగిందని, విద్యార్థులతో కలిసి భోజనం చేశామని, భోజనం నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు తన దృష్టికి తెచ్చిన మరుగుదొడ్లు, మరియు ప్రహరిగోడ తదితర అంశాలను ఈఈపీఆర్ ద్వారా పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యతనిస్తానన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

## అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రిబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై26 ప్రభాతవార్త:** జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ టిజి ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయాల్సిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటి సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. జిల్లాలో టిజి ఐపాస్ ద్వారా 12 పరిశ్రమలకు వివిధ శాఖల ద్వారా మంజూరు చేయాల్సిన అనుమతులు నిర్దేశిత గడువులోగా జారీ చేసేందుకుచర్యలు తీసుకోవాలని తెలిపారు. టిప్రైడ్ ద్వారా షెడ్యూల్డు కులాల వారికి ఇద్దరికి కార్లు, ముగ్గురికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్‌కు, ఇద్దరికి రెండు మిని గూడ్స్ క్యారియ్స్ వాహనాలకు, షెడ్యూల్డు తెగల వారికి ఐదుగురికి కార్లు, ఆరుగురికి ట్రాక్టర్ అండ ట్రైలర్స్‌కు,ఇద్దరికి మిని గూడ్స్ క్యారియర్స్ వాహనాలకు పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ బాబురావు, గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సంజయ్, ఎల్‌డిఎం భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధిఅధికారి ఛత్రు నాయక్, కార్మికశాఖ సహాయ కమిషనర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మహిళా శక్తి క్యాంటిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి:** మూసాపేట మండలంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మూసాపేట మండలంలో పర్యటించారు. మండలమహిళా సమాఖ్యభవనంలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటిన్‌పై చర్చించారు. మహిళా శక్తి కార్యక్రమంద్వారా బ్యాంక్,స్త్రీనిధి ద్వారా రుణం అందజేసి మహిళా క్యాంటిన్‌నుత్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళ శక్తి క్యాంటిన్‌లో అవసరమైన సామాగ్రి కొనుగోలుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఓ నర్సింహులు,డిపిఎం నాగమల్లిక,ఎపిఎంవెంకటాచారి పాల్గొన్నారు.

## మహిళా సమైక్య సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్


మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**అడ్డాకుల, జులై 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం హాల్లో జరిగిన ఈసీ సమావేశానికి శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేంద్రిబోయి ముఖ్య అతిథిగా హాజరై మహిళ సంఘాలు ఏ విధమైన కార్యక్రమాలు చేపడుతున్నారు. సంఘాల బలోపేతం జీవనోపాధి సామాజిక కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా, సామాజిక పరంగా ఎదగాలని మహిళలకు ప్రాముఖ్యత ఇవ్వడంతో పాటు అన్ని కార్యక్రమాలు మహిళల ద్వారానే చేయాలని సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతుంది కాబట్టి మహిళలు అన్ని రంగాలలో పాల్గొనాలని మహిళలకు మహిళ శక్తినందు డైరీ ఫామ్‌లు, కోళ్ల ఫారాలు, మిర్చి యూనిట్లను గ్రామాల వారిగా ఎంత మంది తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. మండలంలో టార్గెట్ కంటే ఎక్కువ మంది మహిళ సభ్యులు అడిగితే కూడా ఇస్తామని అన్నారు. ఈ లోన్లు శ్రీనిధిబ్యాంకు ద్వారా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలను మహిళలు విజిట్ చేయాలని గ్రామస్థాయిలో కార్యక్రమంలో ముహిళల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. ఇక్కడ మహిళలు చాలా యాక్టివ్‌గా ఉన్నారని గ్రూప్ కార్యక్రమాలు, మహిళా శక్తి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ నరసింహులు, డిపిఎం నాగమల్లిక, హమీద్, మండల అధికారులు తహసిల్దార్ మదన్ మోహన్‌గౌడ్, ఎంపిడిఓ శ్రీనివాసులు, ఎంపిఓ, ఎపిఎం, సిసిలు, ఈసీ సభ్యులు, విఓఎలు, మహిళలు పాల్గొన్నారు.

## శ్రీకురుమన్న ఆశీస్సులతో అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



**చిన్నచింతకుంట, జులై26 ప్రభాతవార్త:** మండల కేంద్ర సమీపంలోని ఊకచెట్టు వాగులో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణం వల్ల ప్రజలు అవస్థలు పడతారని తెలిసి గత ప్రభుత్వంలో ధనార్జన ధ్యేయంగా చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడం దారుణమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆర్అండ్‌బి ఈఎన్‌సి మోహన్ నాయక్‌తో కలిసి చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. చెక్‌డ్యామ్ నిర్మాణం వల్ల పక్కనే ఉన్న స్మశాన వాటిక నీటిలో మునిగి పోతున్నాయని తద్వారా త్రాగునీరు కలుషితమై పలు రోగాల బారిన పడుతున్నారన్న విషయాన్ని పలు సందర్భాలలో ప్రజలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. చెక్‌డ్యామ్ సమస్యను శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ఆర్అండ్‌బి ఈఎన్‌సి అధికారుల దృష్టికి తీసుకురావడంతో ఆర్అండ్‌బి అధికారులకు చెక్‌డ్యాం సమస్యను వివరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపినట్లు ఆయన తెలిపారు. అక్కడి నుంచి నేరుగా శ్రీ కురుమూర్తిస్వామి గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రెండు చోట్ల స్థల పరిశీలన ఆర్అండ్‌బి ఈఎన్‌సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రెండు ఘాట్ రోడ్డులను వాహనాల పైకి ఎక్కేదారి మరొకటి వాహనాలు క్రిందికి దిగేదారికి స్థలాలలో నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను గుర్తిస్తామని అధికారులు తెలిపారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్వామిని ఎమ్మెల్యేతో పాటు ఆర్అండ్‌బి ఈఎస్‌సితో పాటు అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండ దిగిన జాతర మైదానంలో ఆయన మాట్లాడుతూ శ్రీకురుమూర్తిస్వామి ఆశీస్సులతో ప్రజా సంక్షేమానికి పాటు పడుతూ ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గత ఎమ్మెల్యే ప్రజాభిప్రాయం లేకుండానే పనులు చేపట్టారని తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ నరసింగం, ఈఈ దేశ్‌నాయక్, ఏఈ శ్రీరామ్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, విండో ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ ఆయా మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులువెంకటేష్, పార్టీసీనియర్ నాయకులు కథలప్ప, ప్రశాంత్, మాజీ కో ఆప్షన్ మహమూద్, వట్టెం శివకుమార్, ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, దామోదర్, గంజి బాలరాజ్, ధనుంజయ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్

**బిజినేపల్లి, జులై26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ రంగంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే చెల్లించాలని, జిఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రధాన డిమాండ్‌తో జులై 30న ఛలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం వెలుగొండ రాములు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 30న ఛలో హైద్రాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పంచాయతీ కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేక పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలు ఇవ్వకపోవడంలో విఫలమైందని ఆయన అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే రిలీజ్ చేయాలని కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని,జిఓ నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని అందరిని పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులతో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద భీమా గ్రాడ్యుటీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. వయసు మీరిందనే సాకుతో కార్మికులను మార్చితే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఉన్న డిమాండ్లతో ఈనెల30నఛలో హైద్రాబాద్‌కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు,శ్రీశైలం జస్వంత్, రవి, సుభాష్, రాము, వీరస్వామి, గొర్లస్వామి, చెన్నమ్మ, లక్ష్మమ్మ, మంగమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.


సిసి రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, ఛైర్మన్ ఆనంద్‌గౌడ్

## రైతులను రుణ విముక్తులను చేశాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సిజె బెనహర్,బుద్దారం సుధాకర్‌రెడ్డి, గోవింద్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజుగౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన ట్రాన్స్‌జెండర్లు..**

తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు ట్రాన్స్ జెండర్స్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించిన వారిలో ట్రాన్స్‌జెండర్ ప్రీతి, అచల, వెన్నెల, గీత ఉన్నారు.

**అభివృద్ధియే మా లక్ష్యం : ఎమ్మెల్యే**

అభివృద్ధియే మా లక్ష్యం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరన్నపేట, వార్డు నంబర్ 14లో సాధారణ నిధులు 10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వీరన్నపేటలోనివార్డులో పర్యటించిప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ అంజయ్య, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఐ బస్వరాజు, డిసిసి ప్రధాన కార్యదర్శిసిరాజ్ ఖాద్రి, నాయకులు బండి మల్లేష్, రఘు, నరేష్ పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

**జడ్చర్ల, జులై 26 ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన అమర జవాన్లకు గుర్తుగా జులై 26న దేశవ్యాప్తంగా విజయ్ దివస్ జరుపుకుంటున్నామని బిజెపి జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జడ్చర్లలో అమరజవాన్లకు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో జడ్చర్లలోని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్గిల్ విజయ దినోత్సవం ప్రతి ఏటా జులై 26న దేశవ్యాప్తంగా జరుపబడుతుందని, 1999 జులై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్రప్రధాన కార్యదర్శి కొండ గణేష్,బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. పద్మజారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, విహెచ్‌పి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఉట్కూర్, జులై 26 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థుల పిరమిడ్ ఆకారంలో నిలబడి జాతీయ జెండాను చేతితో పట్టుకొని అమర జవానులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగాఉపాధ్యాయులు మహేష్ కుమార్ మాట్లాడుతూ ఆనాడు భారత సైనికులు చేసిన సేవలకు మనం ఏమి చేసిన తక్కువ అనికార్గిల్ విజయ దివస్ ప్రతిఏటాజులై 26న దేశవ్యాప్తంగా జరుపబడుతుంది. 1999, జులై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై సాధించిన విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించటం జరుగు తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కిషోర్‌కుమార్, రమేష్, గోపాల్,మనోహర్,హర్షద్,సత్యపాల్,బన్నేష్,కిరణ్, నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

**ఓంనగర్ కార్గిల్ చౌరస్తాలో:** మండల కేంద్రంలోని కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఓంనగర్ కార్గిల్ చౌరస్తా దగ్గర విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏటా జులై 26న దేశవ్యాప్తంగా జరుపుకుంటుందని 1999, జులై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటామని కార్గిల్ యువత పేర్కొన్నారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓంనగర్ కార్గిల్ చౌరస్తా యువత, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.అలాగే మండలంలోని పోలీస్ వ్యవస్థలో పని చేస్తున్నటువంటి కానిస్టేబుళ్లు బషీర్, దేవేందర్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువకులుహర్షవర్ధన్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,అయ్యప్పరెడ్డి, అరవింద్,మధు వెంకటేష్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రాము, శేఖర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రకంటి వసంత,మాజీ ఎంపిటిసి సభ్యులు దొబ్బలి హనుమంతు, లయన్స్ క్లబ్ సభ్యులు శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, జులై26 ప్రభాతవార్త :** కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమర జవాన్లకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డివి చారి ఘనంగా నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని అంబేద్కర్ చౌక్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల త్యాగాలకు గుర్తుగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి అంజన్‌ప్రసాద్, సీనియర్ సభ్యులు కోళ్ళ వెంకటేష్, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, చందాపురంచంద్రశేఖర్, అంబదాస్‌రావు, కట్టా వెంకటేష్, మామిళ్ల పృథ్వీరాజ్, రవికుమార్‌గౌడ్,అరవింద్, శరణప్ప, పీఈటీ అంబ్రేష్, శాంతినికేతన్, భారతీయ విద్యానికేతన్ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జవానుల వేషధారణతో అమరుల నివాళి స్థూపాన్ని విద్యార్థులచే ఏర్పాటు చేయించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానాచార్యులు కుర్మయ్య మాట్లాడుతూ 1999లో భారతదేశ భూభాగాన్ని సంరక్షించడం కోసం ప్రాణ త్యాగం చేసిన 527 మంది అమర జవానుల త్యాగాన్ని స్మరించుకునే సందర్భమే కార్గిల్ దివస్ అని తెలిపారు. అనంతరం అమర జవానులను స్మరించుకుంటూ పాఠశాల ఆచార్యులు, విద్యార్థులు ఒక నిమిషం మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**భూత్పూర్, జులై 26,ప్రభాతవార్త:** పాకిస్థాన్‌పై భారత వీర సైనికులు కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన శుభదినం సందర్భంగా భారత వీరజవానుల్ని స్మరించుకుంటూ శుక్రవారం విద్యార్థులు,యువకులు,ఉపాధ్యాయులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని సన్‌రైజ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.దేశభక్తిని చాటిన పాఠశాల చిన్నారుల్ని,పాఠశాల యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

## ఎట్టకేలకు గోప్లాపూర్ రొడ్డుకు మోక్షం

**భూత్పూర్, జులై 26,ప్రభాతవార్త:** ఎంతో కాలంగా గుంతల మయంగా మారిన భూత్పూర్-గోప్లాపూర్‌ల మధ్య రొడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది.అనునిత్యం ఈ రొడ్డు మీదుగా వెళ్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తన సొంత డబ్బులు వెచ్చించి వెడ్‌మిక్స్‌తో రోడ్డు మరమ్మత్తులు చేయించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు దెంది లక్ష్మికాంత్‌రెడ్డితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలలో పాల్గొన్న కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర, జులై 26 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ గ్రామలో బోనాల పండగ ఉత్సవాలలో నియోజకవర్గ బిజెపి ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు కృష్ణంరాజు, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, కొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కోయిల్‌సాగర్ గ్రామ యువ నాయకులు విశ్వనాథ్, కుమ్మరి శ్రీను, ఆవుల గోపాల్, లక్ష్మణ్‌గౌడ్, అరవింద్‌గౌడ్, వెంకటేష్, రఘు చారి, పవన్, గ్రామ ప్రజలు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.